
సాక్షి
కుమురం భీం
శుక్రవారం ׀ 24 ׀ మే ׀ 2024



బస్‌స్టేషన్ విస్తరణ జరిగేనా?
49 ఏళ్ల క్రితం మంచిర్యాలలో నిర్మించిన బస్‌స్టేషన్‌లో అసౌకర్యాలు తిష్టవేశాయి. ఏళ్ల తరబడి బస్‌స్టేషన్ విస్తరణ ప్రతిపాదనలకే పరిమితమవుతోంది. 8లో▸



ఒంటికీ రెంటికీ తిప్పలు..
మహారాష్ట్ర సరిహద్దులోని కొటా గ్రామంలో సమస్యలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రెండు రాష్ట్రాల పాలన ఉన్నా కనీసం మరుగుదొడ్లు నిర్మించలేదు. 9లో▸

గరిష్ఠం/కనిష్ఠం
41.8 /29.6

వాతావరణం
ఆకాశం కొంతమేర మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉదయం నుంచే వేడిగా ఉంటుంది. ఉక్కపోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

నెట్‌బాల్ ఎంపిక పోటీలు



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో గురువారం జిల్లాస్థాయి నెట్‌బాల్ ఎంపిక పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. ముఖ్యఅతిథిగా హాజరైన డీటీడీవో రమాదేవి పోటీలను ప్రారంభించారు. విద్యార్థులు చదువుతోపాటు అన్నిరంగాల్లో ముందుండాలని సూచించారు. అనంతరం నెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అలీబిన్, ప్రధాన కార్యదర్శి తిరుపతి మాట్లాడారు. జిల్లాస్థాయి నెట్‌బాల్ ఎంపిక పోటీల్లో సీనియర్ బాలుర విభాగంలో 36 మంది, బాలికల విభాగంలో 46 మంది పాల్గొన్నారని తెలిపారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబర్చిన 12 మంది బాలురు, 12 మంది బాలికలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీడీలు, పీఈటీలు హరీశ్, ప్రభాకర్, రాకేశ్, గురువేందర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్- 1 పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలి



వసతులు పరిశీలిస్తున్న కలెక్టర్

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో గ్రూప్- 1 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో గురువారం వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 9న నిర్వహించే గ్రూప్ -1 పరీక్షకు జిల్లాలో 13 కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఆయా సెంటర్లలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అభ్యర్థులకు ఇబ్బందులు తలెత్తకుండా ఫర్నీచర్, విద్యుత్, తాగునీరు వంటి వసతులు కల్పించాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ, మూడు కిలోమీటర్ల పరిధిలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు చేపట్టాలన్నారు. ఇటీవల నీట్ నిర్వహణలో జరిగిన పొరపాట్లు మళ్లీ జరగకుండా సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో రీజినల్ కోఆర్డినేటర్ నర్సింహం, ప్రిన్సిపాల్ రాందాస్, సీఐ సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పాలిసెట్

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో పాలిసెట్ నిర్వహణ కోసం ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పాలిసెట్ కోఆర్డినేటర్ కనకయ్య తెలిపారు. జిల్లా కేంద్రంలోని పలు పరీక్ష కేంద్రాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, గిరిజన బాలికల గురుకుల పాఠశాల, జెండరాలోని డిగ్రీ కళాశాలలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష కొనసాగుతుందన్నారు. పాలిసెట్‌కు జిల్లాలో 883 మంది హాజరు కానున్నారని తెలిపారు. నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదన్నారు. విద్యార్థులను గంట ముందు నుంచే కేంద్రాల్లోకి అనుమతిస్తారని పేర్కొన్నారు.

ఆదివాసీ గూడేల్లో జెండాల ఆవిష్కరణ



మార్లవాయిలో జెండావిష్కరిస్తున్న ఆదివాసీలు

జైనూర్(ఆసిఫాబాద్): జైనూర్‌లో ఈ నెల 13న ఆదివాసీ యువకుడిపై జరిగిన దాడికి నిరసనగా గురువారం మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో ఆదివాసీ జెండాలు ఆవిష్కరించారు. ఏజెన్సీ గ్రామాల్లో ఆదివాసీలను భయభ్రాంతులకు గురిచేసే విధంగా దాడులకు దిగడం సరికాదన్నారు. ఆదివాసీ అనుబంధ సంఘాల నాయకులు, రాయిసెంటర్ సార్‌మెడీలు, పటేళ్లు పాల్గొన్నారు.

ఎక్స్‌ప్రెస్ హైవే రయ్!


- హైదరాబాద్–రాయ్‌పూర్ ఎకానమిక్ కారిడార్‌కు ఓకే
- బెల్లంపల్లి నుంచి గడ్చిరోలి మధ్య గ్రీన్‌ఫీల్డ్ దారి
- ఎన్‌హెచ్–363కి కలుపుతూ కొత్తగా నిర్మాణం
- మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో రవాణా మెరుగు

ప్రాజెక్టు వివరాలు

నిర్మించాల్సిన రోడ్డు: **335**కి.మీ.

రోడ్డు నిర్మాణం: **4/6**వరుసలు

నిర్మాణ వ్యయం అంచనా: రూ.**3178**కోట్లు (గ్రీన్‌ఫీల్డ్ పరిధి)



హైదరాబాద్, రాయ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ హైవే అలైన్‌మెంట్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: మూడు రాష్ట్రాలను కలిపే కీలక జాతీయ రహదారి నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. కేంద్రం రెండేళ్ల క్రితం బెల్లంపల్లి నుంచి మహారాష్ట్రలోని గడ్చిరోలి వరకు కొత్తగా హైవే మంజూరు చేయడం తెలిసిందే. గత కొంతకాలంగా నిర్మాణంలో జాప్యం జరుగగా, ఆ ప్రాజెక్టులో కదలిక వచ్చింది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో పనులు పూర్తి చేసేందుకు రంగం సిద్ధమవుతోంది. దాదాపు వెయ్యి ఎకరాల వరకు భూ సేకరణకు ప్రతిపాదనలు సిద్ధం అవుతున్నాయి. భూ సేకరణ పూర్తయితే పనులు ప్రారంభం కానున్నాయి. మంచిర్యాల, బెల్లంపల్లి, కాగజ్‌నగర్, కౌటాల మండలాల పరిధిలో ప్రాణహిత నది మీదుగా గడ్చిరోలి, అటు నుంచి ఛత్తీస్‌గఢ్‌లోని నయా రాయపూర్ వరకు ఎకానమిక్ కారిడార్ రోడ్డు నిర్మాణం కానుంది.

రాజీవ్ రహదారి, ఎన్‌హెచ్–363కలుపుతూ

హైదరాబాద్, కరీంనగర్‌ను కలిపే రాజీవ్‌రహదారి(స్టేట్ హైవే 1)ను జాతీయ రహదారిగా అప్‌గ్రేడ్ చేయనున్నారు. ఇక బెల్లంపల్లి శివారు నుంచి కొత్తగా గ్రీన్ ఫీల్డ్ హైవేను నిర్మించనున్నారు. మంచిర్యాల–హైదరాబాద్ 208కిలోమీటర్ల స్టేట్ వన్ హైవేగా ఉన్న రాజీవ్ రహదారిని, మంచిర్యాల, బెల్లంపల్లి మధ్య కొత్త రహదారి ప్రారంభమయ్యే 35కిలోమీటర్ల రహదారిని అప్‌గ్రేడ్‌చేసి బ్రౌన్ ఫీల్డ్ హైవేగా మార్చనున్నారు. దుర్గ్(ఛత్తీస్‌గఢ్)–గడ్చిరోలి మధ్య పూర్తిగా గ్రీన్‌ఫీల్డ్ హైవేగా 352కిలోమీటర్ల నిర్మాణం చేపట్టనున్నారు. దీంతో తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ మూడు రాష్ట్రాలకు రవాణా మెరుగుపడనుంది. ఉమ్మడి కరీంనగర్, మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలకు గడ్చిరోలి వరకు ఉన్న పట్టణాలు, గ్రామాలకు రవాణాకు ఉపయోగపడనుంది.



ప్రస్తుతమున్న రోడ్డు(ఎరుపు), నిర్మించాల్సిన రోడ్డు(ఆకుపచ్చ)

భూ సేకరణే సమస్య

జాతీయ రహదారుల నిర్మాణంలో భూ సేకరణ ప్రధాన సమస్యగా మారుతోంది. గ్రీన్‌ఫీల్డ్ హైవేలో రైతుల పంట పొలాలు మార్కెట్ విలువకు తగినట్లుగా పరిహారం ఇవ్వకపోవడం కష్టంగా మారింది. ఇప్పటికే ఎన్‌హెచ్–63పై భూ నిర్వాసితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బెల్లంపల్లి–గడ్చిరోలి మధ్య అటవీ భూములతోపాటు టైగర్‌కారిడార్ ఉండడంతో అనుమతులతోపాటు కొత్తగా ప్రత్యేక అండర్ పాస్‌లు, ఓవర్ బ్రిడ్జిలు నిర్మించాల్సి ఉంటుంది.

మెరుగుపడనున్న రవాణా

'భారత్ మాల'లో భాగంగా ఇప్పటికే ఈ ప్రాంతంలో జాతీయ రహదారుల నిర్మాణాలు జరుగుతున్నాయి. శ్రీరాంపూర్ జీఎం ఆఫీసు నుంచి చంద్రాపూర్ వరకు వెళ్లే ఎన్‌హెచ్–363 పనులు తుది దశకు చేరాయి. ఇక నిజామాబాద్, ఆర్మూర్ జగిత్యాల, లక్సెట్టిపేట, మంచిర్యాల, చెన్నూరు మీదుగా ఎన్‌హెచ్–63 దాదాపు పూర్తి కావొచ్చింది. బైపాస్ నిర్మాణంలో భాగంగా హాజీపూర్ మండలం వేంపల్లి, మంచిర్యాల పట్టణ శివారు, క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో తిమ్మాపూర్ మీదుగా కుర్మపల్లి క్రాస్ వరకు నిర్మాణం కానుంది. ఛత్తీస్‌గఢ్‌లోని జగ్దల్‌పూర్ వరకు మరింత రోడ్డు రవాణా మెరుగుపడనుంది. అంతేకాక జైపూర్ మండలం నర్వా నుంచి వరంగల్ జిల్లా గోపాల్‌పూర్ కొత్తగా ఎన్‌హెచ్–163జీతో మంచిర్యాల, వరంగల్, ఖమ్మం, విజయవాడ వరకు నాలుగు వరుసల గ్రీన్‌ఫీల్డ్ నిర్మాణం కోసం భూ సేకరణ జరుగుతోంది.

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు



జిల్లా కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీఐఈవో శంకర్

- జిల్లాలో ఎనిమిది కేంద్రాలు
- ఉదయం ఫస్టియర్, మధ్యాహ్నం సెకండియర్ ఎగ్జామ్స్
- హాజరు కానున్న 2,989 మంది విద్యార్థులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో శుక్రవారం నుంచి ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. జిల్లావ్యాప్తంగా మొత్తం ఎనిమిది కేంద్రాలు ఏర్పాటు చేయగా.. 2,989 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. కేంద్రాల్లో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. తాగునీరు, మరుగుదొడ్లు, బెంచీలు, ఫ్యాన్లు ఇతర సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అధికారులను ఆదేశించారు. కొన్నేళ్లుగా ఇంటర్ ఫలితాల్లో జిల్లా మెరుగైన ఫలితాలు సాధిస్తుండగా.. ఇటీవల విడుదలైన ఫలితాలు మాత్రం కొంత నిరాశ పరిచాయి. మొదటి సంవత్సరంలో 4,570 మంది హాజరు కాగా.. 2,813 మంది ఉత్తీర్ణత సాధించారు. అలాగే సెకండియర్ పరీక్షలకు 4,095 మంది హాజరు కాగా 2,951 మంది ఉత్తీర్ణులయ్యారు.

ఎనిమిది కేంద్రాలు ఏర్పాటు

ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షల కోసం జిల్లాలో మొత్తం ఎనిమిది కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆసిఫాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, తెలంగాణ మోడల్ స్కూల్‌తోపాటు కాగజ్‌నగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, వసుంధర జూనియర్ కళాశాల, జైనూర్, కౌటాల, తిర్యాణి, రెబ్బెన మండలాల్లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లాలోని 48 జూనియర్ కళాశాలలకు చెందిన 2,989 మంది సప్లిమెంటరీ పరీక్షలు రాయనున్నారు. ఇందులో ఫస్టియర్ విద్యార్థులు 1,938, సెకండియర్ 1,051 మంది ఉన్నారు. జనరల్ విభాగంలో 2,680 మంది, ఒకేషనల్ విభాగంలో 309 మంది విద్యార్థులు హాజరు కానున్నారు.

విద్యార్థులకు దూరభారం

ఈ నెల 24 నుంచి ప్రారంభమయ్యే పరీక్షలు జూన్ 3 వరకు కొనసాగనున్నాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రథమ సంవత్సరం, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ద్వితీయ సంవత్సరం పరీక్షలు నిర్వహిస్తారు. జిల్లాలో 15 మండలాల పరిధిలో కేవలం ఎనిమిది కేంద్రాలు మాత్రమే ఏర్పాటు చేయడంతో విద్యార్థులు దూరభారంతో ఇబ్బంది పడనున్నారు. కెరమెరి, సిర్పూర్(యూ), లింగాపూర్ మండలాల విద్యార్థులు జైనూర్‌కు వెళ్లాల్సి ఉండగా.. వాంకిడి మండలం వారు ఆసిఫాబాద్‌కు.. బెజ్జూర్, సిర్పూర్(టి), చింతలమానెపల్లి మండలాల నుంచి కౌటాలకు.. దహెగాం మండలం విద్యార్థులు కాగజ్‌నగర్ పట్టణానికి వెళ్లి పరీక్షలు రాయాలి. పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటంతోనే 30 కిలోమీటర్ల పరిధిలో ఒక సెంటర్ ఏర్పాటు చేశామని అధికారులు చెబుతున్నారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం 1, సిట్టింగ్ స్క్వాడ్ బృందం 1, ఇన్విజిలేటర్లు 40 మందిని నియమించారు. https://tsbie.cgg.gov.in నుంచి విద్యార్థులు హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

విద్యార్థులు గంట ముందే చేరుకోవాలి

ఇంటర్ పరీక్షలకు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేశాం. సొంత మండలాల్లో కేంద్రాలు లేని వారు గంట ముందుగానే సెంటర్లకు చేరుకోనేలా ప్లాన్ చేసుకోవాలి. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటం, కొన్నిచోట్ల సౌకర్యాలు లేకపోవడంతో పరీక్ష కేంద్రాలు 30 కిలోమీటర్ల పరిధిలో ఉండేలా ఏర్పాటు చేశాం. హాల్‌టికెట్లు, పెన్నులు, ప్యాడ్లు మినహా ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్‌ఫోన్లు తీసుకెళ్లేందుకు అనుమతి లేదు.

– శంకర్, డీఐఈవో

జాప్యం లేకుండా కొనుగోళ్లు చేపట్టాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



రైతుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌అర్బన్/ఆసిఫాబాద్‌రూరల్: ఎలాంటి జాప్యం లేకుండా వరి ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. ఆసిఫాబాద్ మండలం అప్పపల్లిలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం అదనపు కలెక్టర్ దాసరి వేణుతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కొనుగోళ్ల వివరాలపై ఆరా తీశారు. కొనుగోళ్లలో పొరపాట్లు, ఇతర సమస్యలు ఉంటే రైతులు తమ దృష్టికి తీసుకురావాలని, పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ నెల 30లోగా కొనుగోళ్లు పూర్తి చేసేందుకు అధికారులు, నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తూకాల్లో మోసాలు లేకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. కొనుగోళ్లు, సాగు విస్తీర్ణం, ధాన్యం వివరాలను నిర్వాహకులు ప్రతిరోజూ ట్యాబ్‌లో ఎంట్రీ చేయాలని సూచించారు. వెంటవెంటనే ధాన్యాన్ని మిల్లులకు తరలించాలన్నారు. వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. తేమశాతంపై అన్నదాతలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి నర్సింగ్‌రావు, మేనేజర్ వినోద్‌కుమార్, కోఆపరేటివ్ అధికారి రబ్బానీ తదితరులు పాల్గొన్నారు.

సర్వే వేగంగా పూర్తి చేయాలి



వీసీలో పాల్గొన్న జిల్లా సంక్షేమశాఖ అధికారులు

ఆసిఫాబాద్‌అర్బన్: అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో కుటుంబాల సర్వే వేగంగా పూర్తి చేయాలని మహిళా శిశు సంక్షేమశాఖ రాష్ట్ర సంచాలకులు వాకాటి కరుణ, కాంతి వెస్లీ అన్నారు. గురువారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల సంక్షేమశాఖ అధికారులతో అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ప్రభుత్వ ఆదేశాలతో చేపడుతున్న కుటుంబ సర్వేపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ నుంచి వీసీకి హాజరైన జిల్లా సంక్షేమశాఖ అధికారి భాస్కర్ మాట్లాడుతూ.. ప్రతీ అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో కుటుంబాల సర్వే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పిల్లలు, బాలింతలు, వృద్ధులు, మహిళల సంఖ్యపై నివేదిక రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. సమాచార సేకరణపై సీడీపీవోలు, సూపర్‌వైజర్ల పర్యవేక్షణ ఉంటుందన్నారు. చిన్నారుల ఆరోగ్య పరిస్థితులను పర్యవేక్షిస్తూ పోషకాహార లోపం లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. తక్కువ, అతి తక్కువ ఎదుగుదల ఉన్న వారిని గుర్తించి మాములు స్థితికి తీసుకువచ్చేందుకు కృషి చేస్తామన్నారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పౌష్టికాహారం అందేవిధంగా చూస్తామన్నారు. గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో వివరాలు నమోదు చేసుకుని వైద్యపరీక్షలు చేయించేకునేవిధంగా చర్యలు చేపడతామన్నారు. సమావేశంలో జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు అధికారులు, సూపర్‌వైజర్లు, పోషణ్ అభియాన్ సమన్వయ కర్తలు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు.. 'బెస్ట్' స్కూల్స్

- ఒకటి, ఐదో తరగతుల్లో ప్రవేశాలు
- జూన్ 7 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం
- లక్కీడ్రా పద్ధతిలో విద్యార్థుల ఎంపిక
- జిల్లాలోని రెండు స్కూళ్లలో 'బెస్ట్ అవైలబుల్' కింద అడ్మిషన్లు

కౌటాల(సిర్పూర్): ప్రతిభ కలిగిన నిరుపేద విద్యార్థులకు ప్రైవేట్ స్కూళ్లలో నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం బెస్ట్ అవైలబుల్ పథకానికి శ్రీకారం చుట్టింది. ఎంపిక చేసిన విద్యార్థులకు ఉచిత విద్యతోపాటు వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటుంది. జిల్లాలో బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో 2024- 25 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశాల కోసం అర్హుల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని విశ్వశాంతి హైస్కూల్, కౌటాలలోని మయూరి విద్యాలయం బెస్ట్ అవైలబుల్ స్కూళ్లుగా ప్రభుత్వం ఎంపిక చేసింది. ఆయా పాఠశాలల్లో ఐదో తరగతి(రెసిడెన్షియల్)లో 40 సీట్లు అందుబాటులో ఉన్నాయి. 2023- 24 విద్యా సంవత్సరంలో నాలుగో తరగతి పూర్తయిన విద్యార్థులు ఐదో తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఒకటో తరగతిలో నాన్ రెసిడెన్షియల్ కింద 38 సీట్లు కేటాయించారు.



బెస్ట్ అవైలబుల్ పథకంలో ఎంపికైన కౌటాల మయూరి విద్యాలయం

లక్కీడ్రా పద్ధతిలో ఎంపిక

అర్హులైన విద్యార్థులు అన్ని ధ్రువీకరణ పత్రాలను జత చేసి జూన్ 7లోగా జిల్లా కార్యాలయంలో సమర్పించాలి. అనంతరం కలెక్టరేట్‌లో లక్కీడ్రా పద్ధతిలో విద్యార్థులను ఎంపిక చేస్తారు. ఎంపికైన వారికి కాగజ్‌నగర్ పట్టణంలోని విశ్వశాంతి హైస్కూల్, కౌటాలలోని మయూరి విద్యాలయంలో ప్రవేశం కల్పిస్తారు. మరిన్ని వివరాలకు కలెక్టరేట్‌లోని జిల్లా కార్యాలయంలో సంప్రదించాలని అధికారులు సూచిస్తున్నారు. కాగా.. షెడ్యూల్డ్ కులాలకు చెందిన విద్యార్థులకు మరిన్ని అవకాశాలు కల్పించేందుకు జిల్లాలోని మరికొన్ని ప్రైవేట్ పాఠశాలల్లో బెస్ట్ అవైలబుల్ పథకం కింద ప్రవేశాలు కల్పించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

మంచి అవకాశం



ఎస్సీ కులాలకు చెందిన విద్యార్థులకు బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో ప్రవేశాలు మంచి అవకాశం. ఎంపికైన వారికి పదో తరగతి వరకు ఉచితంగా మెరుగైన విద్యనందిస్తాం. అలాగే ప్రభుత్వ పరంగా వారికి అన్ని వసతులు ఉచితంగా కల్పిస్తాం. అర్హులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి.

– శాగంటి యాదగిరి, మయూరి విద్యాలయ కరస్పాండెంట్, కౌటాల

పారదర్శకంగా ఎంపిక




ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో 1, 5వ తరగతిలో ప్రవేశాలు కల్పిస్తున్నాం. జూన్ 7లోగా దరఖాస్తులు జిల్లా కార్యాయలంలో అందించాలి. కలెక్టర్ సమక్షంలో లక్కీడ్రా పద్ధతిలో అర్హులను పారదర్శకంగా ఎంపిక చేస్తాం.

– సజీవన్, జిల్లా షెడ్యూల్డ్ కులాల అధికారి

అర్హులు వీరు.. దరఖాస్తు ఇలా..

ఆసక్తి గల వారు జిల్లా కేంద్రంలోని జిల్లా షెడ్యూల్డ్ కులాలు అభివృద్ధి అధికారి కార్యాలయంలో దరఖాస్తు ఫారం తీసుకోవాలి. కుటుంబంలో ఒక విద్యార్థి మాత్రమే ఈ పథకానికి అర్హులు. జిల్లాకు చెందిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఒకటో తరగతిలో ప్రవేశం పొందేవారు 01- 06- 2018 నుంచి 31- 05- 2019 మధ్య జన్మించి ఉండాలి. జూన్ 1 నాటికి వారి వయస్సు ఐదు నుంచి ఆరేళ్ల లోపు ఉండాలి. గ్రామీణ ప్రాంత విద్యార్థులు తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.1.5 లక్షలు, పట్టణ ప్రాంతాల వారు రూ.2లక్షలోపు ఉండేలా మీసేవ ద్వారా ఏప్రిల్ 1 తర్వాత పొందిన ఆదాయ ధ్రువీకరణ పత్రం పొందుపర్చాలి. దీంతోపాటు మీసేవ నుంచి పొందిన జనన ధ్రువీకరణ పత్రం, కుల, నివాస ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు, మూడు కలర్ పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, తెల్లరేషన్ కార్డు జత చేయాలి. ఐదో తరగతి కోసం దరఖాస్తు చేసుకున్న వారు నాలుగో తరగతి మార్కుల జాబితాతోపాటు బోనఫైడ్ కూడా సమర్పించాలి.

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు



మాట్లాడుతున్న ఎస్‌ఈ వాసుదేవ్

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యకళాశాలలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని విద్యుత్‌శాఖ ఎస్‌ఈ వాసుదేవ్ తెలిపారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీకి సంబంధించిన సర్వీస్ కనెక్షన్‌తోపాటు కళాశాల జనరేటర్‌ను గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మెడికల్ కాలేజీ విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేస్తామని తెలిపారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. విద్యుత్ సరఫరాను నిత్యం పర్యవేక్షిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నాగార్జునచారి, విద్యుత్ శాఖ డీఈ శ్రీనివాస్, ఆసిఫాబాద్ ఏఈ సదాశివ్ తదితరులు పాల్గొన్నారు.

'సఖీ' ద్వారా బాధితులకు ఉచిత సేవలు

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సఖీ కేంద్రం ద్వారా నిరాశ్రయులైన మహిళలు, వేధింపులకు గురైన బాధితులకు వైద్య, న్యాయ సేవలు ఉచితంగా అందిస్తామని జిల్లా సంక్షేమశాఖ అధికారి భాస్కర్ తెలిపారు. సఖి కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సోషల్ యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ సర్వీసెస్ వారి నిర్వహణలో సఖీ కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలు సంతృప్తికరంగా ఉన్నాయన్నారు. మాత, శిశు సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఐదేళ్లలో అందించిన సేవలను సమీక్షించేందుకు ఐదుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కమిటీలో జిల్లా సంక్షేమశాఖ అధికారి, వైద్యాశాఖ నుంచి రెబ్బెన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సుజిత్, వాంకిడి సీడీపీవో రెబెకా, జిల్లా బాలల పరిరక్షణ సంఘం నుంచి కౌన్సిలర్ చంద్రశేఖర్, సూపర్‌వైజర్ కళావతి సభ్యులుగా ఉన్నారని పేర్కొన్నారు. వీరు సఖీ కేంద్రాల సేవలపై నివేదిక అందిస్తారని తెలిపారు.



మాట్లాడుతున్న జిల్లా అధికారి భాస్కర్

క్లుప్తంగా

వ్యక్తిపై కేసు నమోదు

చెన్నూర్: అనుమతి లేకుండా పోలీస్ స్టేషన్ ఆవరణలో ఫొటోలు, వీడియో తీస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ రవీందర్ తెలిపారు. విధులకు ఆటంకం కలిగించాడని హెడ్ కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణానికి చెందిన నూకల సతీశ్‌పై 353 సెక్షన్ కింద కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

భూతగాదాలో ఒకరిపై కేసు

నెన్నెల: గొల్లపల్లి గ్రామానికి చెందిన చింత సురేష్‌పై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. భూతగాదాల్లో అదే గ్రామానికి చెందిన ముదాం ఇందిరాను సురేష్ తిట్టడమే కాకుండా చంపుతానని బెదిరించాడని చెప్పారు. ఇద్దరి చేనులు పక్కపక్కనే ఉండగా చుట్టు కంచె వేసే క్రమంలో ఇరువురు గొడవ పడ్డారని పేర్కొన్నారు. ఇందిరా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

తిర్యాణి: మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కొలాంగూడలో చోటు చేసుకుంది. ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన టేకం రాజు (50) భార్య మూడు నెలల క్రితం మృతి చెందింది. దీంతో మనస్తాపానికి గురైన రాజు మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం అతిగా మద్యం సేవించి కూతురు ఆత్రం భీంబాయిని డబ్బులు అడగగా నిరాకరించింది. దీంతో అక్కడి నుంచి బయటికి వెళ్లి గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుని కూతురు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య

భైంసారూరల్: ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల మేరకు లోకేశ్వరం మండలంలోని బిలోలి గ్రామానికి చెందిన నల్లోల్ల లక్ష్మణ్ (30) మూడు నెలలుగా మాటేగాంలో ఉంటున్నాడు. ఇటీవలే బిలోలిలో ఉన్న తన ప్లాటుకు సంబంధించి వాగ్వాదం జరిగింది. అప్పటి నుంచి మనస్తాపానికి గురై మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలోనే ఇంట్లోనూ తరచూ గొడవలు జరుగుతున్నాయి. గురువారం చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహానికి భైంసా ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుని భార్య భోజవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

కారును ఢీకొన్న బైక్..

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని బస్‌డిపో వద్ద గురువా రం ఉదయం బైక్‌పై వేగంగా వచ్చిన ఓ యువకుడు యూటర్న్ తీసుకునే క్రమంలో కారును బలంగా ఢీకొ ట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచా రం అందించడంతో యువకుడిని చికిత్స నిమిత్తం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

బస్‌స్టేషన్ విస్తరణ జరిగేనా?

- ప్రతిపాదనలకే పరిమితమవుతున్న డిపో తరలింపు
- రహదారిపైనే నిలుస్తున్న బస్సులు
- ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు



మంచిర్యాల బస్‌స్టేషన్‌లో బస్సులు

మంచిర్యాలఅర్బన్: మెరుగైన రవాణా లక్ష్యం.. ప్రయాణికుల క్షేమం మాధ్యేయం అని అధికారులు పదే పదే చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం ఇందుకు భిన్నంగా ఉంటోంది. 49 ఏళ్ల క్రితం మంచిర్యాలలో నిర్మించిన బస్‌స్టేషన్‌లో అసౌకర్యాలు తిష్టవేశాయి. ప్రయాణికులు కూర్చోవడం మాటెలా ఉన్నా.. కనీసం నిలబడేందుకు కూడా స్థలం దొరకని పరిస్థితి. స్థలం కొరతతో బస్సులు రోడ్లపైనే బారులు తీరుతుండడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఏళ్ల తరబడి బస్‌స్టేషన్ విస్తరణ ప్రతిపాదనలకే పరిమితమవుతోంది. ఇటీవల బస్‌స్టేషన్, డిపోను సందర్శించిన ఈడీ వినోద్‌కుమార్ ఇరుకుగా ఉన్న బస్‌స్టేషన్ విస్తరణకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. డిపోను ఆనుకుని ఉన్న ప్రహరీ కొద్ది దూరం తొలగిస్తే స్థలం కలిసి వస్తుందని అధికారులు భావిస్తున్నారు. దీంతో బస్‌స్టేషన్ ఆవరణలో బస్సులు నిలపడం, కొంతమేర సమస్యలు అధిగమించవచ్చని యోచిస్తున్నారు.

ఏళ్లు గడిచినా మెరుగుపడని సౌకర్యాలు..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాగా ఉన్నప్పుడే ఫిబ్రవరి 6, 1975లో మంచిర్యాలలో ఆర్టీసీ డిపో ఏర్పాటు చేశారు. అదే సమయంలో తొమ్మిది ప్లాట్‌ఫాంలు, 32 బస్సులతో బస్‌స్టేషన్ ప్రారంభించారు. మూడెకరాల 21 గుంటల్లో డిపో, 1.34 ఎకరాల్లో బస్‌స్టేషన్ నిర్మించారు. అప్పటి రవాణాశాఖ మంత్రి చొక్కారావు వీటిని ప్రారంభించారు. 1985 నాటికి బస్సుల సంఖ్య 32 నుంచి 118కి పెంచారు. ప్రయాణికుల సంఖ్య.. బస్సులు పెరిగినా ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో మాత్రం సౌకర్యాలు మెరుగుపడలేదు. ప్రస్తుతం డిపో పరిధిలో ఆర్టీసీ సంస్థ బస్సులు 81, 69 అద్దె బస్సులు ఉన్నాయి. 509 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. బస్‌స్టేషన్ మీదుగా రోజుకు 57 వేల కిలోమీటర్ల మేర బస్సులు నడపటం ద్వారా 55 వేల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేస్తున్నాయి. డిపో లక్ష్యం రోజుకు రూ.35 లక్షలు విధించారు. మహాలక్ష్మీ పథకం అమల్లోకి వచ్చిన తర్వాత ప్రయాణికుల సంఖ్య 40 వేల నుంచి 55 వేల వరకు పెరిగింది. ఇది వరకు సాధారణంగా రోజుకు రూ.26 లక్షల ఆదాయం రాగా మహాలక్ష్మీ స్కీంతో కలిపి రూ.32 లక్షల ఆదాయం సమకూరుతోంది.

ఇరుకైన బస్‌స్టేషన్‌తో ఇబ్బందులు

బస్‌స్టేషన్‌లో స్థల కొరతతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మధ్యాహ్నం వేళ బస్‌స్టేషన్‌లో బస్సులు నిలిపేందుకు స్థలం లేకపోవడంతో బెల్లంపల్లి చౌరస్తా నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారిపై బస్సులు నిలపాల్సి వస్తోంది. దీంతో సాధారణ ప్రజలు, వాహనదారులకు ఆటంకం కలుగుతోంది. ప్లాట్‌ఫాంలు లేకపోవడం, ప్రయాణ ప్రాంగణంలో స్థలం లేకపోవడంతో బస్సు వెనకాల బస్సు ఖాళీ సీట్లతోనే అక్కడి నుంచి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. బస్‌స్టేషన్ ప్రారంభంలో తొమ్మిది ప్లాట్‌ఫాంలు, 14 స్టాల్స్ ఏర్పాటు చేసిన అధికారులు ప్లాట్‌ఫాంల సంఖ్య పెంచడంపై దృష్టి పెట్టకుండా 25కు పైగా స్టాల్స్ మాత్రం పెంచారు. దీంతో బస్‌స్టేషన్ చుట్టూ దుకాణాలు నిర్మాణం జరిగి ఇరుకుగా మారుతోంది. బస్‌స్టేషన్ ఆవరణలో నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లను తొలగిస్తే కొంతమేర స్థలం కలిసివచ్చే అవకాశాలు లేకపోలేదు.

డిపో తరలింపు ప్రతిపాదనలకే పరిమితం..

పెరుగుతున్న ప్రయాణికులకు అనుగుణంగా బస్‌స్టేషన్ విస్తరించక పోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అప్పట్లో బస్‌స్టేషన్ విస్తరణకు డిపో తరలించాలని యోచించారు. భూదాన్ భూమి, ఐటీఐ స్థలంలో డిపో ఏర్పాటుపై ప్రతిపాదనలు వచ్చాయి. మరోవైపు ఏసీసీ సమీపంలోని నాలుగెకరాల ప్రభుత్వ భూమి, వెంపల్లిలో 10 ఎకరాల భూమిని పరిశీలించారు. అప్పట్లో భూదాన్ భూమిలో స్టేడియం, కళావేదిక నిర్మాణం చేపట్టాలని అధికారులు భావించడంతో స్థలం కేటాయింపునకు విముఖత చూపారు. ఐటీఐలో ప్రతిపాదనలు వచ్చిన మొదట్లో తూర్పు ప్రాంతం కేంద్రంగా మంచిర్యాల జిల్లా ఏర్పాటు కావడం, కుమురంభీం జిల్లా ప్రజలకు అనువుగా కలెక్టర్ భవనం నిర్మించాలని యోచించారు. అండాళమ్మ కాలనీ సమీపంలో, ఎంసీసీ ఆవరణలో ప్రభుత్వ స్థలం పరిశీలనకు వచ్చింది. మరోవైపు ఏసీసీ సమీపంలోనే నాలుగెకరాల స్థలం పరిశీలించారు. బస్సులతో ట్రయల్‌రన్ చేసి అంతా ఓకే చెప్పారు. ఆతర్వాత ఎమైందో ఏమోగానీ స్థల కేటాయింపునకు అడుగులు పడలేదు. మరోవైపు హాజీపూర్ మండలంలోని వెంపల్లిలో 28 ఎకరాల ప్రభుత్వం స్థలం ఉండగా 10 ఎకరాలు కేటాయించేందుకు గ్రామ పంచాయతీ, అధికారులు సుముఖత వ్యక్తం చేశారు. కానీ ఆర్టీసీ ఉన్నతాధికారులు దూరభారం అవుతుందని చెప్పడంతో డిపో తరలింపు ప్రక్రియ వెనక్కి వచ్చింది. ఇదే స్థలాన్ని ఆనుకుని జాతీయ రహదారి వెళ్తుండడంతో ఆర్టీసీ అధికారులు ఆలోచనలో పడినట్లు తెలుస్తోంది. భూదాన్ భూమి, నస్పూర్‌లో కలెక్టరేట్ సమీపంలో స్థలం కేటాయిస్తే డిపో ఏర్పాటు సులువుగా మారనుంది. డిపో తరలింపు ఇప్పటికిప్పుడు సాధ్యం కాకపోయినా బస్‌స్టేషన్‌ను కొంతమేర విస్తరించాలనే ఆలోచనతో ఇబ్బందులు తొలగనున్నాయి. ఈ విషయమై డీఎం రవీంద్రనాథ్‌ను సంప్రదించగా బస్‌స్టేషన్ విస్తరణకు అందివచ్చిన అవకాశాలను పరిశీలించాలని ఉన్నతాధికారులు సూచించినట్లు తెలిపారు.

ఐటీ రిటర్న్స్‌కు సరైన పత్రాలు సమర్పించాలి

శ్రీరాంపూర్: ఆదాయపన్ను రిటర్న్స్‌కు సరైన పత్రాలు సమర్పించాలని సింగరేణి యాజమాన్యం గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది. కొంతమంది ఉద్యోగులు, అధికారులు 2021–22, 2022–23 ఆర్థిక సంవత్సరాల్లో ఐటీ రిటర్న్స్ కోసం తప్పుడు పత్రాలు సమర్పించినట్లు ఆదాయ పన్ను శాఖ అధికారులు గుర్తించారన్నారు. కావున ఇట్టి తప్పులపై ఉద్యోగులు, అధికారులపై చర్యలు తీసుకోకుండా వారే తిరిగి తప్పులను సరిచేసుకునే అవకాశం కల్పించిందన్నారు.

పాఠశాలల్లో పనులు పూర్తి చేయాలి



పనులు పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

రామకృష్ణాపూర్: అమ్మ ఆదర్శ పాఠశాల కింద చేపట్టిన పనులు పాఠశాలలు ప్రారంభం కాకముందే పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ అధికారులను ఆదేశించారు. గురువారం క్యాతనపల్లిలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులను పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూనే పనులు త్వరగా పూర్తి చేసేలా చూడాలని అన్నారు. మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, ఏఈ అచ్యుత్ పాల్గొన్నారు.

ఐటీ ఆప్షన్ తేదీ పొడిగించాలి

- ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య



మాట్లాడుతున్న సీతారామయ్య

శ్రీరాంపూర్: కార్మికుల ఇన్కమ్ టాక్స్‌కు సంబంధించిన ఆప్షన్ ఎంపిక చేసుకునే తేదీని పొడిగించాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య యాజమాన్యాన్ని కోరారు. గురువారం ఆర్కే న్యూటెక్ గనిలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సింగరేణి కార్మికులు ఆదాయపన్ను చెల్లింపులో కొత్త టాక్స్ విధానం , పాత టాక్స్ విధానంలో ఏది ఆప్షన్‌గా పెట్టుకోవాలో అంగీకారం తెలిపే పత్రాలను సమర్పించాల్సి ఉందని, ఇందుకు తేదీని పొడిగించాలన్నారు. ఈరెండింటిలో దేన్ని ఎంచుకోవాలని ఇంకా కార్మికులకు పూర్తి అవగాహన లేదని, యజమాన్యం దీనిపై మరింత అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కె బాజీసైదా, ఉపాధ్యక్షుడు కొట్టే కిషన్ రావు, పిట్ కార్యదర్శి ఆకుల లక్ష్మణ్, నాయకులు సంగం సదానందం, గొల్లపల్లి రాంచందర్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, నాయకులు చంద్రమౌళి, రమేశ్, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

సెక్యూరిటీగార్డుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం ఇస్తున్న శంకర్‌రావు

శ్రీరాంపూర్: సింగరేణిలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డుల సమస్యలను పరిష్కరించాలని ఐఎన్టీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్ రావు డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్‌లోని ఎస్అండ్‌పీసీ కార్యాలయం వద్ద సెక్యూరిటీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెక్యూరిటీ సిబ్బందికి కార్యాలయం వద్ద రెస్ట్‌హాల్‌ను ఏర్పాటు చేయాలని, డ్యూటీ నిర్వహించే చెక్ పోస్టుల వద్ద మౌలిక సదుపాయాలను కల్పించాలని, ఓపెన్ కాస్టులో ఉన్న గార్డ్ రూములను ఆధునికరించాలని, ఇంకా ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం సెక్యూరిటీ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పిట్ కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా ఎండీ గులాం మొయినుద్దీన్, అసిస్టెంట్ సెక్రటరీగా పాలం శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులుగా చక్రధర్, ప్రచార కార్యదర్శులుగా పూదరి సాంబయ్య, సత్యనారాయణ, ముఖ్య సలహాదారులుగా ఆంజనేయులు, విజయ్ కుమార్, షిఫ్ట్ కార్యదర్శిగా బండ రవీందర్, తదితరులను ఎన్నుకున్నారు.

ఎన్నికల విధులు ఆన్‌డ్యూటీగా పరిగణించాలి



వినతిపత్రం ఇస్తున్న సత్తయ్య

శ్రీరాంపూర్: ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహించిన సింగరేణి క్లారికల్, ఎస్ అండ్ పీసీ సిబ్బందికి ఆన్‌డ్యూటీని పరిగణించాలని బీఎంఎస్ నాయకులు యజమాన్యాన్ని కోరారు. ఈ మేరకు ఆ యూనియన్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య గురువారం గోదావరిఖనిలో సింగరేణి డైరెక్టర్ (పా.,ఆపరేషన్) ఎన్‌వి కే శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిబంధన ప్రకారం బొగ్గు పరిశ్రమల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ఎన్నికల డ్యూటీలు చేస్తే ఆన్‌డ్యూటీగా పరిగణించాల్సి ఉందన్నారు. కానీ కంపెనీ స్పెషల్ లీవ్ ఇవ్వడం వలన కార్మికులు ఆర్థికంగా నష్టం పోతున్నారని, వెంటనే దీన్ని ఆన్‌డ్యూటీగా ప్రకటిస్తూ సర్క్యూలర్ జారీ చేయాలని కోరారు.

‘భయంతోనే కాంగ్రెస్ దాడులు’



దివ్యను పరామర్శిస్తున్న గోమాసే శ్రీనివాస్

దండేపల్లి: కాంగ్రెస్ ఓటు బ్యాంకు దెబ్బతింటోందనే భయంతో కాంగ్రెస్ నాయకులు బీజేపీ నాయకులపై దాడులకు పాల్పడ్డారని పెద్దపల్లి లోక్‌సభ బీజేపీ ఎంపీ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్ విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో దండేపల్లి మండలం చింతపల్లిలో బీజేపీ మహిళా నాయకురాలు అక్కల దివ్యపై కాంగ్రెస్ పార్టీ నాయకులు దాడి చేశారు. దీంతో ఆమెను శ్రీనివాస్ గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీజేపీకి ప్రజల్లో ఆదరణ పెరిగిందని, దాడి చేయడమే కాకుండా తప్పుడు కేసులు పెట్టడం సరికాదని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గోపతి రాజయ్య, నాయకులు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, సురేందర్, మహేష్, కిషన్, వెంకటేష్, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

కారు బోల్తా.. ఇద్దరికి గాయాలు



బోల్తా పడిన కారు

సోన్: మండలంలోని మాదాపూర్ ఐబీ వద్ద గురువారం కారు బోల్తా పడి ఇద్దరికి గాయాలయ్యాయి. హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ వెళ్తున్న కారు మాదాపూర్ ఐబీవద్ద 44వ జాతీయ రహదారిపై అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఘటనలో కారులో ప్రయాణిస్తున్న సాయిని రవి, సిద్దిక్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ సతీష్ అజాగ్రత్తగా కారు నడపడంతోనే ప్రమాదం చోటు చేసుకుందన్నారు. బాధితుని సోదరుడు సాయిని ప్రవీన్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై సంతోషం రవీందర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని ఫిల్టర్‌బెడ్‌కు చెందిన ఆరుగురు కుటుంబ సభ్యులు మహారాష్ట్రలోని సైలానిబాబా దర్గాను దర్శించుకునేందుకు బుధవారం రాత్రి కారులో బయల్దేరి వెళ్లారు. దర్శనం చేసుకున్న అనంతరం తిరుగు ప్రయాణంలో వాసిమ్ సమీపంలో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కారులో ఉన్న నలుగురు పెద్దలతోపాటు మరో ఇద్దరు చిన్నారులకు గాయాలయ్యాయి.

కారు ఢీకొని గేదెకు గాయాలు

నేరడిగొండ: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై గురువారం రాత్రి ఓ కారు గేదెను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. నిర్మల్ నుంచి ఆదిలాబాద్ వైపు కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు సురక్షితంగా బయటపడ్డారు. కారులోని బెలూన్ ఓపెన్ కావడంతో ప్రాణాలతో బతికి బయటపడ్డారు. ఆ కారు వెనకాల మరో కారు ఆగడంతో వెనుకనుంచి ఐచర్ ఆ కారును ఢీకొట్టింది. అందులో ప్రయాణిస్తున్న వారికి చిన్నపాటి గాయాలయ్యాయి. వెంటనే గ్రామస్తులు ఐచర్ వాహనంతో పాటు డ్రైవర్‌ను పోలీసులకు అప్పగించారు. రాకపోకలకుఅంత రాయం కలగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

నిర్మల్‌రూరల్: మండలంలోని మంజులాపూర్ గ్రామ శివారులో గురువారం రాత్రి పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ ఎస్సై సాయికుమార్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడిచేసి నిందితుల వద్ద నుంచి రూ.17,200 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. పేకాట ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసులకు సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగాఉంచుతామన్నారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్టు

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీసు స్టేషన్ పరిధిలోని పోలీసు కాలనీలో గల హనుమాన్ ఆలయం, అదే కాలనీకి చెందిన టేకం రామారావు ఇంట్లో ఈనెల 21న జరిగిన చోరీ కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఆదిలాబాద్‌రూరల్ సీఐ ఫణిధర్ తెలిపారు. గురువారం మావల పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. హనుమాన్ ఆలయంలో హుండీలోని రూ.6వేల నగదు, రామారావు నివాసంలో 2 గ్రాముల బంగారం, 10 తులాల వెండి ఆభరణాలు దొంగిలించారు. మహారాష్ట్రలోని కిన్వట్‌కు చెందిన డి.శ్యామ్, ఆదిలాబాద్‌లోని లక్ష్మీనగర్‌కు చెందిన అబ్దుల్‌తో పాటు మహారాష్ట్రకు చెందిన మరో ఇద్దరు ఫారుఖ్, ఫేరోజ్ ఇందులో భాగస్వాములని తేలిందన్నారు. శ్యామ్, అబ్దుల్‌ను అరెస్టు చేశామని, మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు సీఐ పేర్కొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

కాసిపేట: మండలంలోని దేవాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వెంకటాపూర్ గ్రామ శివారులో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కుర్రేఘాట్‌కు చెందిన పేంద్రం చిలుకు (55), కొట్నాక గణేశ్ (24) మృతి చెందారు. పోలీసులు, మృతుల కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు కుర్రేఘాట్‌కు చెందిన చిలుకు వరుసకు తమ్ముడైన గణేశ్‌తో కలిసి కొండాపూర్ యాప నుంచి వెంకటాపూర్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా మార్గమధ్యలో వెంకటాపూర్ శివారులోని డంపింగ్‌యార్డు సమీపంలో ట్రాక్టర్ ఢీకొట్టింది. ఘటనలో చిలుకు అక్కడికక్కడే మృతి చెందగా గణేశ్‌ను మంచిర్యాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ట్రాక్టర్ డ్రైవర్ జుగునాక యశ్వంత్ అజాగ్రత్తగా నడపడంతోనే ప్రమాదం చోటు చేసుకుందని వారు పేర్కొన్నారు. మృతుని కుమారుడు పేంద్రం వినోద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ పున్నంచంద్ తెలిపారు. వెంకటాపూర్ కుర్రేఘాట్‌కు చెందిన ఇద్దరు గ్రామస్తులు ఒకేసారి మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

వాంకిడి: రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సాగర్ తెలిపిన వివరాల ప్రకారం కాగజ్‌నగర్ మండలంలోని లైన్‌గూడకు చెందిన సిడాం భీంరావు, అతని తల్లి సిడాం రుకుంబాయి (55) ఒక ద్విచక్ర వాహనంపై, శంభు మరో వాహనంపై, అడ అంజు, అడ భీంరావు మరో బైక్‌పై బుధవారం బంబార గ్రామ పంచాయతీలోని బండకాసలో నిర్వహించిన దేవార పూజ కార్యక్రమానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఖమాన శివారులో బొలెరో వాహనం భీంరావు, శంభు బైక్‌లను ఢీకొట్టింది. సిడాం భీంరావు, శంభుకు స్వల్పంగా రుకుంబాయికి తీవ్ర గాయాలయ్యాయి. వెనకాలే వస్తున్న లైన్‌గూడకు చెందిన అడ అంజు, భీంరావు దంపతులు గమనించి అంబులెన్స్‌లో ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రుకుంబాయిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. బులెరో డ్రైవర్ బంబార గ్రామానికి చెందిన సెండె నగేష్‌గా గుర్తించారు. మృతురాలి కుమారుడు భీంరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య



సంతోష్ (ఫైల్)

బెల్లంపల్లిరూరల్: ప్రేమ విఫలమై యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బెల్లంపల్లి మండలం బుచ్చయ్యపల్లిలో చోటు చేసుకుంది. తాళ్లగురిజాల ఎస్సై నరేష్ తెలిపిన వివరాల మేరకు మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట మండలం చందారం గ్రామానికి చెందిన దేశరాజుల రామాంజనేయులు, పద్మ దంపతుల చిన్న కుమారుడు దేశరాజుల సంతోష్ (20) హుస్నాబాద్‌లో డిప్లామా చదువుతున్నాడు. ఇదే క్రమంలో ఓ అమ్మాయిని ప్రేమించాడు. విషయం తల్లిదండ్రులకు చెప్పడంతో సదరు అమ్మాయి తల్లిదండ్రులను సంప్రదించగా పెళ్లికి నిరాకరించారు. దీంతో సంతోష్ మనస్తాపానికి గురికావడంతో బుచ్చయ్యపల్లిలో ఉన్న అమ్మమ్మ ఇంటికి తీసుకొచ్చారు. బుధవారం రాత్రి వంట గదిలోని దూలానికి చీరతో ఉరేసుకున్నాడు. గురువారం ఉదయం కుటుంబ సభ్యులు వంటగది తలుపులు పగులగొట్టి చూడగా ఉరేసుకుని కనిపించాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని చందారం తరలించారు. మృతుని తండ్రి రామాంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

బీసీ కుల జనగణన చేపట్టాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

భీమారం: బీసీ కుల జన గణన చేపట్టాలని బీసీ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు ఒడ్డపల్లి మనోహర్ అన్నారు. బీసీ కుల జనగణన వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ గురువారం బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో తహసీల్దార్ సదానందంకు వినతిపత్రం అందజేశారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ బీసీ డిక్లరేషన్ పేరిట బీసీ కుల జనగణనతోపాటు కార్పొరేషన్ ఏర్పాటుకు హామీ ఇచ్చిందని తెలిపారు. నెలలు గడుస్తున్నా కుల జనగణన విషయంలో ఎలాంటి చర్యలు చేపట్టకుండా అకస్మాత్తుగా జూన్ చివరి వారంలో స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటోందని అన్నారు. ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తోందని ఆరోపించారు. బీసీ కుల జనగణన, బీసీ కార్పొరేషన్ ఏర్పాటు అనంతరమే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. జిల్లా నాయకులు వేముల మల్లేశ్, గుడిమల్ల వెంకటేష్, నరహరి, రమేశ్ గౌడ్,మెండె మల్లేశ్ పాల్గొన్నారు.

వడ్డీ జమ ఆలస్యం

- నాలుగేళ్లుగా పెండింగ్
- ఎదురుచూపుల్లో మహిళా సంఘాల సభ్యులు

జిల్లా వివరాలు
జిల్లాలో గ్రామైఖ్య సంఘాలు:701
స్వయం సహాయక సంఘాలు:16,656
సభ్యులు:1,76,142



సమావేశమైన మహిళా సంఘ సభ్యులు (ఫైల్)

పాతమంచిర్యాల: మహిళా సంఘాల బలోపేతం కోసం ప్రభుత్వం ప్రోత్సాహకంగా వడ్డీని వారి పొదుపు ఖాతా, రుణ ఖాతాల్లో జమ చేస్తోంది. స్వయం సహాయక సంఘాల సభ్యులు బ్యాంకు లింకేజీ స్త్రీనిధి పథకాల రుణాలు తీసుకుని అసలు, వడ్డీతో సహ బ్యాంకులకు చెల్లిస్తే సభ్యులు చెల్లించిన వడ్డీకి ప్రభుత్వం మరికొంత కలిపి వారి ఖాతాల్లో జమ చేస్తుంది. మహిళా సంఘాల సభ్యులు వారు తీసుకున్న రుణాలు క్రమం తప్పకుండా కిస్తులు చెల్లించిన సంఘాలకే వడ్డీ ప్రోత్సాహకం వర్తిస్తుంది. ఇందు కోసం రుణాలు పొందిన మహిళా గ్రూపు సభ్యులు ప్రతినెలా క్రమం తప్పకుండా కిస్తులు చెల్లించే విధంగా వీవో గ్రూపు లీడర్లు, వీవోఏలు మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పిస్తున్నారు. 2023 మార్చి 8న మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లాలోని 8,459 స్వయం సహాయక సంఘాల సభ్యులకు 2018, 2019 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మాత్రమే రూ.12.62 కోట్లు వడ్డీ ప్రోత్సాహకాన్ని గత ప్రభుత్వం విడుదల చేసింది. 2020 నుంచి 2024 వరకు పెండింగ్‌లో ఉన్న వడ్డీ ప్రోత్సాహకం కోసం మహిళా సంఘాల సభ్యులు ఎదురు చూస్తున్నారు.

వడ్డీ రావాల్సి ఉంది

మహిళా సంఘాల సభ్యులు ప్రతీ సంవత్సరం వారు చెల్లించిన రుణాలకు సంబంధించి వడ్డీని ప్రభుత్వం తిరిగి చెల్లిస్తుంది. కానీ నాలుగు సంవత్సరాలుగా వడ్డీ రాలేదు. ప్రభుత్వం విడుదల చేస్తే సభ్యుల ఖాతాలలో జమ చేస్తాం.

– కిషన్, డీఆర్డీవో, మంచిర్యాల